# ప్రకృతి - ప్రవృత్తి



"అతడు నల్లగా ఉంటాడు. నల్లగా ఉన్నా నాజూగ్గా ఉంటాడు. ఆ నల్లని నాజూకు మనిషి తెల్లని బట్టలే తొడుగుతాడు. అతనిని చూసి తారుడ్రమ్ము చంకలు తట్టుకొంటే అతడు తొడిగిన తెల్లని బట్టల్ని చూసి అరవిరిసిన మల్లెలు మూతి ముడుచుకొంటాయి!

అతడు ఒక మనిషి. బతుకు తెలిసిన మనిషి. బతుకు నేర్చిన మనిషి!

అతడెప్పుడు నలుగురితో కలిసి మెలిసి ఉంటాడు. నలుగురిచుట్టూ కాళ్ళరిగేటట్టు తిరగతాడు. తిరిగి తిరిగి పిలస్తాడు. అతడు పిలిస్తే అందరు వస్తారు. వచ్చి అతనితో కలిసి మెలిసి ఉంటారు. అతను అలా నలుగురితో కలిసి మెలిసినట్లు కనిపించినా, అతడెప్పుడూ ఒంటరిగాడు. ఒంటరితనములో హాయి అతనికి బాగా ఒంటబట్టినట్లుంది.

అతడు మాట్లాడుతాడు. అందరితో మాట్లాడుతాడు. అంతా తెలిసినట్లు మాట్లాడుతాడు. అందరూ తన గుప్పెట్లో ఉన్నట్లు తనంటే ప్రాణం వదలుతున్నట్లు మాట్లాడుతాడు. అతడు అందరితో మాట్లాడినా అంతా తెలిసినట్లు మాట్లాడినా అతడు మాట్లాడినట్టే కనిపించదు.

అంటే అంత అందంగా మాట్లాడుతాడు. అందంగా మాట్లాడుతున్న అతనిని చూస్తుంటే సుమతి శతకకారుడు మనసులో మెదులుతుంటాడు.

కొందరు నవ్వుతారు. బూడిదను చూసిన గాడిద జ్ఞాపకం వస్తుంది. మరి కొందరు నవ్వుతారు. ఆడుగుర్రాన్ని చూచిన మగగుర్రం మనస్సులో మెదలుతుంది. మరికొందరు నవ్వుతారు. ముచ్చట్లాడుకొంటున్న పిచ్చుకలు కనులముందు నిలుస్తాయి. అతడు నవ్వుతాడు. అది నవ్వుగాదు!– నల్లబల్లపై తెల్లని సుద్దముక్కతో గీచిన రేఖ. దరహాస రేఖ!

అతడా దరహాస రేఖతోనే దరిదాపుల్ని దగద్ధాయమానం చేస్తాడు. కుశల ప్రశ్నలు కురిపిస్తాడు. పరిసరాలను మురిపిస్తాడు. సమయం చూస్తాడు. తెలివిగా పాచిక వేస్తాడు. తన అవసరాలను తీర్చుకొంటాడు. అందరికీ మంచిగా ఎవ్వరికీ తెలియనట్లుగా!– నవ్వు నాలుగు విధాల చేటంటారు. కానీ అతని నవ్వు– నలభై విధాలా మేలు.

ఆ మనిషి... అదే ఆ నల్లని నాజూకు మనిషి ఉన్నట్లుండి ఊడిపడ్డాడు. మా ఇంట్లో ఉగాదినాడు. అప్పుడు నా అవతారము వర్ణనాతీతం. ఒళ్ళంతా నూనె. నా మానసంరక్షణ మీద సవాల్ చేస్తూ ఒక్కగానొక్క కౌపీనం. ఒంటిమీద కారుతున్న నూనెను ఒంటిలో ఇమిడించడానికి కుస్తీ పడుతున్నాను నాకు నేనుగా. పండగపూట పిండివంటకాలతో పొయ్యివద్ద సతమతమవుతున్న శ్రీమతి అప్పుడప్పుడు కాస్త తెరపి చిక్కించుకొని నావద్దకు వచ్చి “చెవుల్లో బాగా పోయండి నూనె. అదో ఆకాళ్ళకు సరిగా నూనె అంటలేదు. బాగా రుద్దుకోండి” అని హెచ్చరించి పోతూఉంది.

ఇంటి ఎదురుగా వీధి గుమ్మానికి కాస్త పక్కగా నా చూపుల్లో పడేటట్లుగా వీధి విద్యుద్దీప స్తంభానికి చేరువగా ఎవడో కట్టెలమ్ముకొనేవాడు. కట్టెల మోపును నేలమీద నిలవేశాడు. ఒకచేత్తో మోపును నేర్పుగా పట్టి నిలబెట్టాడు. మరొక చేతి చూపుడు వేలితో నుదిటి చెమటను తీసి నేలమీద కారుస్తున్నాడు. ఒంటిమీద ధారాళంగా కారుతూ ఉంది చెమట. తలమీద చుట్టను విప్పాడు. అది ఎటు కొలిచినా మూరకు మించని తుండుగుడ్డ. ఆ తుండుగుడ్డతో చెమటను తుడుచుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

నా ఒంటిమీద నూనె తగలని చోటు మా శ్రీమతి కంటపడుతూ ఉంది. కట్టెలమ్ముకొనేవాని శరీరంపై చెమట వాడి పెళ్ళాంకంట పడడంలేదు. నేను నూనెతో కుస్తీ పడుతూ ఉంటే వాడు చెమటతో తడిసి తబ్బిబ్బులవుతున్నాడు. ఇద్దరమూ మనుషులమే– ఉగాది మా ఇద్దరికీ పండుగే.

“అరెరె! ఏంబ్రదర్? ఇంకా తలస్నానం కాలేదా?... అబ్బెబ్బె! ఏడాదికి ఒక్కనాడు సూర్యోదయానికి పూర్వమే అంతా ముగిసిపోవాలి బ్రదర్! లేలే...అందురూ నీకోసం కాచుక్కూచున్నారు”. ఊడిపడిన మనిషి ముద్దుముద్దుగ మందలించాడు.

ఆ మందలింపుతో నానవ్వు విలన్ నవ్వులా అందగించింది.

“నవ్వు నాలుగు విధాల చేటు బ్రదర్”– నవ్వునే పెట్టుబడిగా పెట్టుకొన్న పెద్దమనిషి నవ్వును గురించి వ్యాఖ్యానిస్తున్నాడు.

మళ్ళీ నవ్వకుండా ఉండలేకపోయాను.

"ఇదో బ్రదర్! తీరిగ్గా నవ్వుకుందాం. అక్కడేమో వాళ్ళు కాచుక్కూచున్నారు. తొందరగా తెములు".

ఒంటికాలిపై నిలబడ్డాడతడు. లేడికి లేచిందే పరుగు. అతనితో వాదించి ప్రయోజనం లేదని అనుభవం నేర్పిన పాఠాన్ని పురస్కరించుకొని స్నానాల గదికి పరిమితమయ్యాను. స్నానాల గదిలో నాకు తెలియకనే సంగీతం వచ్చింది. మా శ్రీమతికి చిరుకోపం వచ్చింది. కోపం ఆడవాళ్ళకు... అందులో పండగపూట వస్తే ఇక అన్ని రంగాల్లో ఆపూట పస్తే- అందుకని ఆనాడైనా ఉత్సాహంగా ఉందామని తొందరగా బయటపడడానికి ప్రయత్నిస్తున్నాను. కొత్తబట్టల కొసలకు పసుపు కుంకుమ నామమాత్రంగా తాకించి శ్రీమతి తెచ్చింది. ఉగాదినాడు కొత్తబట్టలు కట్టుకోవాలట. ఆ కొత్త బట్టల్ని చూస్తుంటే ఎటు కొలిచినా మూరెడుకు మించని తుండుగుడ్డ మనసును తొలుస్తూఉంది.

పరుగెడుతున్న కాలానికి పగ్గాలు వేసి పట్టుకోలేము. పరిభ్రమిస్తున్న కాలాన్ని పంచాంగాలకు పరిమితం చేయలేము. నిన్నటితో చేరిపోయే నేటిని నిముషమైనా పట్టి నిలపలేము. నిముషమైనా నిలపలేని నేడు పండుగ. ఆ ఒక్కనాటిలోనే ఉన్నంతలో కొండంతగా మామిడి పిందెలు కాయించుకొంటున్నాం. వేపపూతను పూయించుకొంటున్నాం. పిందెను పూతను మరికాస్త కొత్త బెల్లంతో కలిపి జీవితానికి ప్రతీక అయిన పచ్చడిని తయారు చేసుకొంటున్నాం.

ఆలోచిస్తూ బట్టలు తొడుక్కొన్నాను. అంతలో శ్రీమతి నా మనస్సులో మెదులుతున్న పచ్చడిని మా ఇద్దరి అరచేతులో పెట్టింది. ఆ పచ్చడిని తింటూ ఆ మనిషిని అదే ఆ నల్లని నాజూకు మనిషిని చూపులతోనే ప్రశ్నించాను కార్యక్రమం ఏమిటోచెప్పమని.

"ఏముంది బ్రదర్? అక్కడ వాళ్ళంతా కాచుక కూర్చున్నారని చెప్పానా?"

"చెప్పావు".

"ఇప్పుడు మనం అక్కడికి వెళ్ళాలి!"

"వెళ్ళదాం!"

"వెళ్ళి వాళ్ళూ మనం కలవాలి. కలిసి మొట్టమొదట దేవుణ్ణి చూడాలి!"

"కొంప ముంచావుగద బ్రదర్! పండగనాడు కూడా... అన్నట్లు దేవుడూ దెయ్యమేనా?- దేవుడేముంది బ్రదర్! నిర్వికార నిరామయంగా నిలబడి ఉంటాడు. వాడిని ఎప్పుడైనా చూడవచ్చు. ఈపూట మన దృష్టి కాస్త మారాలి బ్రదర్. సినిమా లోకం చూడు. అక్కడ పుట్టినవాళ్ళు చస్తున్నారు. చచ్చినవాళ్ళు మళ్ళీ పుడుతున్నారు. కొందరు చావలేక బతుకుతున్నారు. కొందరు బతికి ఛస్తున్నారు".

"ఛ ఛ! తప్పు బ్రదర్. సంవత్సరానికి మొదటి దినం. దేవుణ్ణి చూడాలి. ఈ ఏడంతా హాయిగా గడపడానికి అర్చన చేయించాలి. లోకకల్యాణం కోసం దేవుణ్ణి వేడుకోవాలి" దేవుని

తలంపుతోనేమో నిమీలితనేత్రుడయ్యాడు. కుడిచేతి అరచేత్తో హృదయాన్ని గట్టిగా పట్టుకొన్నాడు. అటుయిటు పోతుందన్న భయంతోనేమో?_ఆ తరువాత "ఏమంటావ్?" అన్నట్లుగా నన్ను చూస్తూ నవ్వాడు. అతని నవ్వు! అది అంతే!_దానికి బదులు పలుకడం మహా కష్టం!

అందరు కలిసి గుడికి వెళ్ళాము.

మానవతకు గోరీకట్టి దేవుడికి గుళ్ళు గోపురాలు కట్టించడంలో మనం ఘనులముకాబట్టి ఇక్కడ గుడులకు కొదవలేదు. అలాంటి గుళ్ళలో అదీ ఒక్కటి. ఆ గుడిలోని దేవుడిముందు నిలబడ్డాము.

దేవుడు మాట్లాడడు. పూజారి మాట్లాడుతాడు. ఆ మాట్లాడే పూజారితో అప్పటికే మాటలు కలిపాడు ఆ మనిషి!- అదే ఆ నల్లని నాజూకు మనిషి. మహానేర్పుగా అంటే మా పరపతి పెరిగిపోయిందన్నమాట. ఆ పరపతి అందరినీ అవతలికి నెట్టి మమ్మల్ని ముందు నిలబెట్టింది. పూజారి అర్చనపేర దేవుణ్ణి వరసబెట్టి పొగిడి పొగిడి గుక్కతిప్పుకోవడానికి కన్నట్లుగా ఆగి హారతి పడుతున్నాడు. మేమందరము దేవుడికి నమస్కరిస్తున్నాము. అది నమస్కార బలమో? లేక రక్తంలో జీర్ణించుకపోయిన సంస్కార ప్రభావమో?- నామట్టుకు నాకు కన్నులు మూతపడ్డాయి. అలా ఎంత సేపు ఉన్నామో తెలియదు. కన్నులు తెరిచి చూశాను. దేవుడు అక్కడే ఉన్నాడు. పూజారి మాత్రం విసుక్కొంటున్నాడు- తీర్థ వినియోగంలో తీరిక చిక్కక. అయితే ఆ మనిషి ! అదే ఆ నల్లని నాజూకు మనిషి అక్కడ లేదు. అతనికోసం కన్నులు పరిసరాలను సర్వేచేస్తున్నాయి.

దేవాలయ ప్రాంగణంలోని ఓ మండపంలో కనుపించాడతడు- ఓ అధికారిని పలకరిస్తూ. మరొక వ్యక్తిని చూసి మందహాసం చేస్తున్నాడు. ఎవరో దూరంగా చూస్తూ కనుపిస్తున్న మరొక వ్యక్తివైపు చేతిని ఆడిస్తున్నాడు. అంతలో అక్కడ ఊడిపడిన ఓ పెద్ద అధికారికి చేతులు జోడిస్తున్నాడు. కడకు ఓ పూజారి వెంటపడ్డాడు.

ఇటు తిరిగి మిత్రులవైపు చూశాను. ఎవరి లోకంలో వాళ్ళున్నారు. ఒకతను విప్పారిన నేత్రాలతో దేవుని స్తుతిస్తున్నాడు. మరొకతను నిమీలిత నేత్రుడై ఉన్నాడు. ఇంకొకని పెదవులు తికమకలు పడుతున్నాయి. అందరినీ చూశాను. అటుపై నా అరచేతిని చూసుకొన్నాను. అందులో ఉన్నవి అయిదు వేళ్ళు. అవి సమంగా లేవు.

గర్భగుడి నుండి బయటపడి ప్రదక్షిణం పేర ప్రాకారములో నడుస్తున్నాము. చూపుమేరలో ఆ మనిషి- అదే ఆ నల్లని నాజూకు మనిషి కనిపించాడు. ఎడమచేతి అరచేతిలో ఆకు ఉంది. నోటికీ చేతికీ తాళం వేస్తున్నాడు కుడిచేతితో. మేము కంటపడడంతో గబుక్కున అటుతిరిగాడు. ఇప్పుడు వెడల్పయిన అతని వీపు మాత్రం కనుపిస్తూ ఉంది. పాడుకండ్లు- వద్దన్నా అతని వీపును దూసుకొని వెళ్ళి అతని చేతుల్ని నోటిని గమనిస్తున్నాయి.

మేము అతనిని సమీపించాము. అతడు మాతో కలిశాడు. ఏమీ ఎరగనట్లు మరేమీ జరగనట్లు "ఏం బ్రదర్? బాగా దర్శనమయిందికదూ?" అని అడుగుతున్నాడు.

నా మనస్సు చివుక్కుమనింది.

"ప్రసాదం! దేవునిపేర మనం తీసుకొంటున్న ఆహారం. ఆకలి తీరడానికి కాదు. అయితే ఆ మనిషి- అదే ఆ నల్లని నాజూకు మనిషి పండుగపూట లోకకళ్యాణాన్ని కాంక్షించి దేవుణ్ణి చూడాలన్న మనిషి- గప్‌చిప్‌గా మింగి ఎంత గమ్మత్తుగా వ్యవహరించాడు" చివుక్కుమన్న మనసు చిందరవందరగా ఆలోచిస్తూ ఉంది.

దర్శనానంతరం ఆలయ ప్రాంగణములో కాసేపు కూర్చోవడం సంప్రదాయమట. మా మిత్ర భక్తబృందం సంప్రదాయాన్ని పాటిస్తున్నారు. వాళ్ళందరూ మంచివాళ్ళు. సున్నములో సూక్ష్మాన్ని వెదికే బుద్ధిమంతులు కారు. వచ్చిన చిక్కంతా నాకే. ఏదో తపన. తపనలో ఆలోచన. ఆలోచనలోపడ్డాను.

ఆలయం ముందు నిలబడ్డాను. అంతమందిని ఆకర్షిస్తున్న దేవుడి లీలలు తలపోస్తున్నాను. 'గొర్రెదాటు'గా భావించే మనస్తత్వాలతో సమన్వయపరచడానికి యత్నిస్తున్నాను. ఆ దేవుణ్ణి చూడడానికని వెడుతున్న వేలాదిమందిని చూస్తున్నాను. ఆ భక్తుల్ని కాయకర్పూరమని విసిగిస్తున్న వ్యాపారుల్ని చూస్తున్నాను. చిత్రమైన మానవ ప్రవృత్తితో మధనపడుతున్నాను.

ఉన్నట్లుండి ఏదో పాదాలమీద పారాడినట్లనిపించింది. వంగి చూశాను. ఓ మరుగుజ్జు. మోకాళ్ళకిందికే ఉన్నాడు. పెద్దతల. ఆ తలకు అతికించినట్లు చిన్న చేతులు. చిన్నకాళ్ళు. వంకాయకు కాళ్ళూ చేతులని పొరకపుల్లలు గుచ్చినట్లు. వాడు చేతులు చాస్తే పాదాలకు తగులుతున్నాయి. వాడివైపు నేను వింతగా చూశాను. వాడు నావైపు ఆశగా చూశాడు. మా చూపులు కలిశాయి. కలిసిన చూపుల్లో 'కరుణ' ఉన్నట్లు పసిగట్టాడు. ఆపై చేతిని చాపాడు. అప్రయత్నంగా నా చేయి నా జేబులోనికి వెళ్ళింది. ఓ పది పైసల కాసు వాడి అరచేత రాలింది.

అరిచేతపడిన పదిపైసల్ని కళ్ళకద్దుకొన్నాడు. నా పాదాలు వెనక్కి వెళుతున్నా తాకి మొక్కాడు. ఆతర్వాత కృతజ్ఞతా పూర్వకంగా రెండు చేతులు జోడించాడు. ఇదంతా నిముషాల్లో జరిగిపోయింది. అక్కడికి నాతో పని తీరిపోయినట్లుగా మరొకతన్ని ఆశ్రయించాడు. అతనివద్ద అంతే. అలాగే మరొకతనివద్ద. నలుగురి దగ్గర నాలుగు కాసులు చేతరాలాయి. లెక్కించుకొన్నాడు. అక్కడినుండి గుండ్రాతికి కాళ్ళు వచ్చినట్లు గునగున నడిచాడు. చూపు మేరలో ముగ్గురు ముష్టివాళ్ళు. ఒకడు గుడ్డి. మరొకడు కుంటి. ఇంకొకడు పండు ముసలి. వాళ్ళను సమీపించాడు. ఒక్కొక్కరికి అయిదేసి పైసలిచ్చాడు- ఆ అసహాయులకు ఈ అసహాయ శూరుడు. ఒకటి తనజేబులో వేసుకొన్నాడు. మళ్ళీ బయలుదేరాడు.

నేను గమనిస్తూనే ఉన్నాను. వాడు చాపిన చేయి వెనక్కుపోవడం లేదు రిక్తంగా. నాలుగు కాసులు చేతరాలడమే తరువాయి. దొల్లు దొల్లు పుచ్చకాయలా వెళ్ళి ఆ ముష్టివాళ్ళ ముందు నిలబడుతున్నాడు. తలా కొంత వేస్తున్నాడు. మళ్ళీ బయలుదేరుతున్నాడు. అదే తన పని అన్నట్లుగా. ఇదంతా ఏదో నాటకంలో దృశ్యంలా నిర్ణీతంగా జరిగిపోతూ ఉంది.

వాడిని గమనిస్తూంటే లోకం కనులముందు తిరుగుతూ ఉంది. ఆ లోకంలో ఆ మనిషి-అదే ఆ నల్లని నాజూకు మనిషి కనిపిస్తున్నాడు. పిండి వంటకాలతో పండుగ మజాలో పడ్డ శ్రీమతి కనుపిస్తూ ఉంది. కట్టెలమ్మి తెచ్చిన డబ్బుతో పండగ చేసుకొందామని ఎదురుచూస్తున్న కట్టెలమ్మేవాడి పెళ్ళాం కనిపిస్తూ ఉంది ఓ గుడిసెలో. ఇత్తడిలాంటి బతుకులు కొన్ని. పుత్తడిలాంటి బతుకులు కొన్ని. పుత్తడిలా పైకి కనిపించే బతుకులో ఇత్తడిలాండి మనస్తత్వాలు. ఇత్తడిలా తోచే బతుకులో పుత్తడిలాంటి మనస్తత్వాలు. ఈ మనస్తత్వాలు మారేదెప్పుడు? సమాజములో ఆర్థిక అసమానతలు తొలిగేదెప్పుడు. ఈ మహత్తరమైన మార్పుకు మార్గదర్శకుడుగా కనుపిస్తున్న ఆ వామనమూర్తి_విశ్వమూర్తి కాదు_త్రివిక్రమమూర్తి! ఆ త్రివిక్రమమూర్తికి చేతులెత్తి నమస్కరించాలనిపించింది. అలా చేయడానికి నా సంస్కారం అడ్డుపడింది! ●

కథా నిలయం
శ్రీకాకుళం

ఆంధ్రభూమి
(8, జూన్ 1978)